ఆత్మకూరు : సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కమలాపూర్ : ఉప్పల్ రైల్వేగేట్ వద్ద కిలోమీటర్ పొడవునా నిలిచిన వాహనాలు

పరకాల : ట్రాలీ ఆటోలో రజతోత్సవ సభకు తరలుతున్న నాగారం మహిళలు

రజతోత్సవ ప్రభంజనం

- సమరోత్సాహంతో బైలెల్లిన జనం
- దారి పొడవునా జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలు
- రహదారులపై చీమల బారుల్లా వాహనాలు

వరంగల్ : ఉర్సు బైపాస్ రోడ్డు మీదుగా సభకు వెళ్తున్న వాహనాలు

వరంగల్ లీగల్ : రజతోత్సవ సభకు బయలుదేరిన వరంగల్ న్యాయవాదులు

దామెర : దమ్మన్నపేట నుంచి బహిరంగ సభకు వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

శాయంపేట : గంగిరేణిగూడెంలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 27 : తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ సభకు జనం ప్రభంజనంగా బైలెల్లారు. సమరోత్సాహంతో దారి పొడువునా జై తెలంగాణ.. జై కేసీఆర్ నినాదాలు చేశారు. రజతోత్సవ సభకు వెళ్లే వాహనాలు రహదారులపై చీమల బారుల్లా కనిపించాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉర్సు బైపాస్ రహదారిపై క్షణం తీరిక లేకుండా వాహనాలు వెళ్తూనే ఉన్నాయి. ఎండను సైతం లెక్క చేయకుండా గుండె నిండా కేసీఆర్‌ను నింపుకున్నా జనం ఉత్సాహంగా రజతోత్సవ సభకు తరలివెళ్లారు. ఉద్యమ సమయంలో ఓరుగల్లులో కేసీఆర్ నిర్వహించిన సభలను రజతోత్సవ సభ గుర్తుకు తెచ్చింది. దండులా కదలిన జన ప్రవాహంతో ఓరుగల్లు తడిసి ముద్దయింది. చంటి పిల్లలను చంకనెత్తికుని జనం కేసీఆర్ సభకు బైలెల్లారు. ఖమ్మం రహదారి పొడువునా వేలాది వాహనాల బారులు కనిపించాయి. రజతోత్సవ సభకు బైలెల్లిన జనం తమ ఇంటి నుంచే సద్ది మూటలు తెచ్చుకుని దారిలోనే భోజనాలు చేశారు. రజతోత్సవ సభకు వెళ్లాలి... కేసీఆర్ చెప్పింది వినాలి.. అనే ఆసక్తితోనే ప్రజలు భారీగా తరలివెళ్లారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గం, భూపాలపల్లి, పరకాల, హుజూరాబాద్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కమలాపూర్ మండలంలోని ఉప్పల్ మీదుగా వెళ్లారు. ఉప్పల్ వద్ద రైల్వేగేటు పడడంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అలాగే మండలంలోని ఉప్పల్, గోపాల్‌పూర్, కమలాపూర్, గూడూరు, అంబాల, శ్రీరాముల పల్లి, మర్రిపల్లిగూడెం, వంగపల్లి, కన్నూరు, భీంపల్లి, గుండేడులో గులాబీ జెండా ఎగురవేసి సభకు తరలివెళ్లారు. ఆత్మకూరు మండలం నుంచి సభకు 2,500 మందికిపైగా వెళ్లినట్లు మండలాధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి తెలిపారు. ధర్మసాగర్ మీదుగా నల్లగొండ జిల్లా, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు సభకు తరలివెళ్లారు. పరకాల పట్టణం, మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. పట్టణంలోని 6, 8, 15, 13వ వార్డుల కౌన్సిలర్లు దామెర మొగిలి, అడప రాము, చందుపట్ల సుజాత, శనిగరపు రజినీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగలో స్థానిక వార్డు అధ్యక్షులు అల్లె చిరంజీవి, అడప రఘుపతి జెండాను ఆవిష్కరించారు. అనంతరం రజతోత్సవ సభకు తరలి వెళ్లారు. పట్టణ ఇన్‌చార్జి గురుజపల్లి ప్రకాశ్‌రావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగురి విజయపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్ఎస్ నాయకులు చందుపట్ల సాయి తిరుపతిరెడ్డి, శనిగరపు నవీన్, పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, నాయకులు నక్క చిరంజీవి, దుంపేటి నాగరాజు, యూత్ సభ్యుడు దుప్పటి సుజయ్ రానా పాల్గొన్నారు. దామెర మండలంలోని దమ్మన్నపేట, ఊరుగొండ, పులుకూర్తి, పసరగొండ, దామెర గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో బీఆర్ఎస్ జెండా ఎగురవేశారు. అనంతరం స్వీట్లను పంచిపెట్టి రజతోత్సవ సభకు వెళ్లారు. నాయకులు పాండవుల భిక్షపతి, కునాటి సునీల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ముదిగొండ కృష్ణమూర్తి, మండలాధ్యక్షుడు గండు రాము, మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, మాజీ సర్పంచ్ మేడిపల్లి సాంబయ్య, యూత్ మండలాధ్యక్షుడు మెంతుల రాజు, బండి అశోక్, కొత్త భాస్కర్, దుబాసి నవీన్, గోవిందు అశోక్ పాల్గొన్నారు. శాయంపేట మండలంలోని 24 గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం సభకు తరలివెళ్లారు. హనుమకొండలోని 10వ డివిజన్ నుంచి పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ ఉడుతల సారంగపాణి, పులి హరికృష్ణ, సంపత్, మహిళా నాయకురాళ్లు, 4వ డివిజన్ నుంచి కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్, 5వ డివిజన్ అధ్యక్షుడు బొల్లపెల్లి పున్నంచందర్ ఆధ్వర్యంలో నాయకులు సభకు బయలుదేరి వెళ్లారు. పండుగ సాగర్, సమ్మయ్య, కానుగంటి అరవింద్, మీనయ్య పాల్గొన్నారు. హసన్‌పర్తి మండలం నుంచి సభకు జనం ఉప్పెనలా కదిలి వెళ్లారు. హసన్‌పర్తి నుంచి ఎల్కతుర్తి వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దారులు మొత్తం గులాబీ మయమయ్యాయి. ప్రతి ఇంటి నుంచి గులాబీ జెండా పట్టుకొని ప్రజలు సభకు బయలెల్లారు. ఐనవోలు మండలంలోని 17 గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు 135 ఆటోలు, 6బస్సుల్లో సుమారు 2 వేల మంది తరలివెళ్లారు. సొసైటీ వైస్ చైర్మన్ బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్‌రావు, మండల కన్వీనర్ మోహన్, జడ్పీ మాజీ కో ఆప్షన్ ఉస్మాన్‌అలీ, మండల మాజీ కో ఆప్షన్ గుంషా వళి, మాజీ సర్పంచ్‌లు సురేశ్, స్వామి, సదానందం, రమేశ్, నాయకులు కుమార్, అశోక్, రఘువంశీ, చందు పాల్గొన్నారు.

ఐనవోలు : జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మండల కన్వీనర్ మోహన్

హనుమకొండ చౌరస్తా : 10వ డివిజన్ నుంచి సభకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి : బస్సులు దిగి సభకు కాలినడకన బయలెల్లిన ప్రజలు

బస్సులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల/నడికూడ, ఏప్రిల్ 27 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు తరలుతున్న బస్సులను పరకాల పట్టణంలో ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నామన్నారు. సభకు పలు గ్రామాల నుంచి స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు తరలివస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రసంగం కోసం లక్షల మంది ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ఈ సభతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గురిజపల్లి ప్రకాశ్‌రావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి, నాయకులు నేతాని శ్రీనివాస్‌రెడ్డి, గంట కళావతి, బండి శ్రావణి, నక్క చిరంజీవి, తెలంగాణ కుమార్ పాల్గొన్నారు. అలాగే నడికూడలో చల్లా పార్టీ జెండా ఆవిష్కరించారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన రాజయ్య..

కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న రాజయ్య

ధర్మసాగర్, ఏప్రిల్ 27 : ఎల్కతుర్తిలో నిర్వహించిన రజతోత్సవ మహాసభకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ధర్మసాగర్ మీదుగా వెళ్తుండగా మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య ఆయనకు మండల కేంద్రంలో స్వాగతం పలికారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, పలువురు మహిళాలు సభకు తరలివెళ్లారు. రాజయ్య మండల కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద జెండా ఊపి బస్సులు, ఆటోలను ప్రారంభించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

సుమారు 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు స్వల్ప గాయాలు

ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సులు

మడికొండ, ఏప్రిల్ 27 : మడికొండ శివారులోని ఔటర్ రింగ్‌రోడ్డుపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి మరో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. జనగామ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ సభకు వస్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న డీసీఎం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకాలే ఖమ్మం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా, సుమారు 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో రింగ్‌రోడ్డుపై ట్రాఫిక్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

గులాబీమయమైన నగరం

- హోర్డింగులు, జెండాల ఏర్పాటు
- డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో తరలిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

నగరంలో వెలిసిన హోర్డింగులు

హనుమకొండ, ఏప్రిల్ 27 : జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో హనుమకొండ నగరం మొత్తం గులాబీ మయమైంది. ఎక్కడ చూసిన హోర్డింగ్‌లు, జెండాలు, పోస్టర్లతో నిండింది. ఆదివారం సాయంత్రం జరిగిన సభకు పెద్ద సంఖ్యలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలివెళ్లారు. ఆయా డివిజన్లలో జెండాలను ఆవిష్కరించారు.

కాంగ్రెస్సోల్లు జూత్తే షేక్ అయితరు..

- సయ్యద్ గోరిమియా, రాయగూడెం, ధర్మసాగర్ మండలం

భీమదేవరపల్లి : ఇది సభలెక్క లేదు.. జాతర లెక్కల్నే ఉన్నది. అబ్బో ఇంతమందా.. కేసీఆర్‌ను సూడాలని పిల్లల్ని సంకనెత్తుకుని కుటుంబమంతా కలిసి వచ్చినం. కేసీఆర్ అంటే అభిమానం లేనోళ్లు ఎవరూ ఉండరు. గుండెల నిండా కేసీఆర్‌ను నింపుకున్నోల్లే ఈ సభకు వచ్చిండ్రు. ఎటు చూసినా జై కేసీఆర్ జై కేసీఆర్ అంటాండ్రు. ఇంతమంది జనాలను జూత్తే కాంగ్రెస్సోల్లు నిజంగా షేక్ అయితరు. వాళ్ల గుండెల్ల రైల్లు పరుగెడ్తయ్.. ఇసుకవోత్తే రాలనంత మంది వచ్చిండ్రు.. తెలంగాణ అంటేనే కేసీఆర్, కేసీఆర్ అంటేనే తెలంగాణ. మాబోటోల్లు సల్లంగా ఉండాలంటే కేసీఆర్ మళ్ల సీఎం కావాలే.

మళ్లీ కేసీఆరే వస్తడు..

- తూటి లక్ష్మణ్ ముత్తారం

కమలాపూర్ : మళ్లీ కేసీఆర్ సారే ముఖ్యమంత్రి అయితడు. సార్ వస్తనే ప్రజలకు న్యాయం జరుగుతది. కాంగ్రెస్ పాలనలో ఏ పథకం అమలు కావడం లేదు. ఆరు గ్యారెంటీలు అన్నరు.. రుణమాఫీ కాలే. రైతు బంధు రాలే.. కొందరికే వచ్చినయి. చాలామందికి రాలే అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది. కేసీఆర్ చేసిన పనులే కనబడుతున్నయి. రాబోయే రోజుల్లో కేసీఆర్ వస్తనే బాగుంటుందని ప్రజలు అంటున్నరు.

కేసీఆర్‌ను చూసేందుకు పోయిన..

- ఆకుతోట సంతోష్, శాయంపేట మండలం

శాయంపేట, ఏప్రిల్ 27 : కేసీఆర్ సార్‌ను చూసేందుకు రజతోత్సవ సభకు పోయిన. ఆయన్ను చూసినంక మనసు నిమ్మలమైంది. పదేళ్లు తెలంగాణను ఎంతో మంచిగ పాలించిండు. బీఆర్ఎస్ పాలనే బాగుంది. రైతుబంధును కేసీఆర్ టైముకు ఇచ్చిండు. ఇప్పుడు మూడు సార్లు నాకు అసలే రాలేదు. రుణమాఫీ కాలేదు. వడ్ల పైసలు రెండు నెల్లకు ఏసిండు. కరెంటు అత్తాంది.. పోతాంది. తులం బంగారం చెప్పిండు ఇయ్యలే. రూ.500 గ్యాస్ సబ్సిడీ రావడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో బస్ కిరాయిలు ఆడోళ్లకు బంద్ చేసిండ్రు. మగోళ్లు నిలబడిపోతున్నరు. గిట్లున్నది పాలన. కేసీఆరే అన్నీ చేసిండు. ఏదైనా సమయానికి వచ్చింది. అందుకే రజతోత్సవ సభకు పోయిన. ఎన్నో సంక్షేమ పథకాలను అందించిండు కేసీఆర్. ఎవుసం మంచిగ సాగింది. కేసీఆరే తెలంగాణకు దిక్కు.

కేసీఆర్ పాలన మళ్లీ రావాలి..

- కునాటి సునీల్‌రెడ్డి, రైతు, ఊరుగొండ

దామెర, ఏప్రిల్ 27 : కేసీఆర్ పాలనను రైతులు, ప్రజలమంతా మళ్లీ కోరుకుంటున్నం. కాంగ్రెస్ సర్కార్ వచ్చినప్పటి నుంచి రైతులమంతా అనేక ఇబ్బందులు పడుతున్నం. చాలా మందికి రుణాలు మాఫీ కాలే. పంటలకు నీళ్లు ఇవ్వలే. పంటలు ఎండిపోయినయ్. వ్యవసాయ బావులకాడ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదు. రైతు బంధు డబ్బులు చాలామంది రైతులకు పడలేదు. అందుకే కేసీఆర్ పాలనను మళ్లీ కోరుకుంటున్నం. అందుకే స్వచ్ఛందంగా సభకు వెళ్తున్నం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★MS Office & Multimedia Teaching చేయుటకు Trainer (Full Time / Part Time) కావలెను. Monthly Salary Rs. 15,000/-. Vidyarthi Computers. Cell: 6309013619
NTW-6586

సమ్మర్ స్పెషల్ ఆఫర్

★ శ్రీశైలి బ్యూటి పార్లర్ Only అడ్మిషన్ ఫీ 2,000/- with సర్టిఫికెట్ ఫ్రీ, బ్యూటీషన్, మగ్గం వర్క్ కోర్స్ నేర్పించబడును. వెంటనే సంప్ర: Call Me: 9989060668.
NTW-15698

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పనికి వెళ్తే.. ప్రాణం పోయింది

- గోడ కూలి యువకుడి మృతి
- తృటిలో ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం

నాగరాజు(ఫైల్)

శాయంపేట, ఏప్రిల్ 27 : పేద కుటుంబం అతడిది. పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గోడ డ్రిల్లింగ్ పనికి పోయాడు. పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి మీద పడడంతో మారెపల్లి నాగరాజు(33) అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శాయంపేటలో ఆదివారం జరిగింది. ఇద్దరు యువకులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. శాయంపేటకు చెందిన రిటైర్డ్ టీచర్ కన్నాపురం రాజవీరు తన పాత ఇంటికి వాస్తు ప్రకారం మార్పులు చేయిస్తున్నాడు. దర్వాజలు తీసి, స్లాబ్ కూల్చేందుకు శాయంపేటకు చెందిన గాజె సాంబరాజు, మారెపల్లి నాగరాజు, పల్లం అనిల్ వచ్చారు. స్లాబ్‌పైకి ఎక్కి డ్రిల్లింగ్ మిషన్‌తో నాగరాజు, అనిల్, సాంబరాజు పని చేస్తున్నారు. అయితే మరో డ్రిల్‌బిట్ తెచ్చేందుకు సాంబరాజు దిగి వెళ్లిపోయాడు. అతను తిరిగి బైక్‌పై వచ్చి దిగుతున్న క్రమంలో ఒక్కసారిగా స్లాబ్ కూలి నాగరాజు కింద పడ్డాడు. దీంతో పైన ఎలాంటి ఆధారం లేకుండా ఉన్న చెన్నగోడ అమాంతం నాగరాజుపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. సాంబరాజు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి పైన పడిన గోడను తొలగించి చూడగా అప్పటికే నాగరాజు మృతి చెందాడు. సాంబరాజు బయటకు వెళ్లకుంటే అతను కూడా ప్రమాదంలో పడేవాడని స్థానికులు చెప్పారు. నాగరాజుకు భార్య భవానీ, మూడున్నర సంవత్సరాల ఇద్దరు కవల కూతుళ్లు ఉన్నారు. చిన్న పిల్లలు తండ్రిని కోల్పోవడంతో ఆ కుటుంబం రోదనలు మిన్నంటాయి. ప్రతి ఒక్కరు కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనా స్థలంలోనే నాగరాజు మృతదేహాన్ని ఉంచి సాయంత్రం వరకు తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబం ఆందోళన చేసింది. సాయంత్రం ఎస్సై పరమేశ్ చేరుకుని మాట్లాడారు. అనంతరం మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

నల్లబ్యాడ్జీలు ధరించి కాజీపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ తీస్తున్న వడ్డేపల్లి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

కాజీపేట, ఏప్రిల్ 27 : కాజీపేట పట్టణం వడ్డేపల్లి ట్యాంక్ బండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్ము కశ్మీర్‌లో పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన అమాయక టురిస్టుల ఆత్మశాంతి కోసం ఆదివారం ఉదయం వాకర్స్ నల్ల బ్యాడ్జీలతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లెపల్లి రాజేశ్వర్ గౌడ్ అధ్యక్షతన ట్యాంక్‌బాండ్ నుంచి ప్రారంభమై ఫాతిమా నగర్ చౌరస్తా మీదుగా సిద్ధార్థనగర్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో భారత్ మాతాకీ జై, వందేమాతరం, ఖబడ్దార్ పాకిస్తాన్ ఉగ్రవాదుల్లారా... ఖబడ్దార్, దేశ్‌కీ రక్షా కౌన్ కరేగా కౌన్ కరేగా...హం కరేగా, హం కరేగా అంటూ నినాదాలు చేశారు. మదర్ థెరిస్సా విగ్రహం సమీపంలో దాడిలో అశువులు బాసిన టురిస్టుల చిత్రపటాల ముందు కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి సంజీవరెడ్డి, సభ్యులు సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, కొండ్ర శంకర్, వెంకటేశ్వర్లు, స్వరూపారాణి, ప్రభావతి, హైమావతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, రిటైర్డ్ ఏసీపీ రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ, ఏప్రిల్ 27 : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ దృష్ట్యా రద్దు చేశామన్నారు. మళ్లీ వచ్చే నెల 5వ తేదీన యథావిధిగా గ్రీవెన్స్ కొనసాగుతుందన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఏప్రిల్ 27 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రశాంత్‌నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వైద్యశాలల్లో టీజీఎంసీ తనిఖీలు

కేసుల నమోదుకు సిఫారసు

నయీంనగర్, ఏప్రిల్ 27 : తెలంగాణ వైద్య మండలి సభ్యులు డాక్టర్ నరేశ్‌కుమార్, వరంగల్ లీగల్ యాంటీ క్వాకరీ కమిటీ చైర్మన్ డాక్టర్ అన్వర్ మియా, సెక్రటరీ డాక్టర్ వెంకటస్వామి, హనుమకొండ అదనపు డీఎంహెచ్‌వో మదన్‌మోహన్ నేతృత్వంలో జిల్లాలోని మూడు నకిలీ వైద్య కేంద్రాల్లో శనివారం తనిఖీ చేశారు. ఎటువంటి విద్యార్హతలు లేకుండా పలువురు వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. కేయూ క్రాస్ రోడ్డులోని అమైరా క్లినిక్‌లో నిర్వాహకులు ఫజాషైక్, ఇమ్రాన్‌ఖాన్ వైద్యపరంగా ఎటువంటి విద్యార్హతలు లేకుండా డెర్మటాలజీ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, పీఆర్పీ థెరపీ, లేజర్ థెరపీ చేస్తున్నట్లు గమనించారు. భీమారంలోని శ్రీనివాస క్లినిక్‌లో నిర్వాహకుడు శ్రీనివాస్‌కు విద్యార్హతలు లేవని, ఎస్ఆర్ఆర్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు అనిల్ అనుమతి లేకుండా, వైద్యుల పర్యవేక్షణ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు వ్యక్తులపై జాతీయ వైద్య కమిషన్ చట్టం, తెలంగాణ స్టేట్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ చట్టం (టీఎస్ఎంపీఆర్) ప్రకారం కేసులు నమోదు చేస్తామని వారు తెలిపారు.

అపూర్వ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

25 సంవత్సరాల అ'పూర్వ' సమ్మేళనం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 27 : వారంతా 25 సంవత్సరాల తర్వాత ఒకచోట కలుసుకున్నారు. హనుమకొండ సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాల(తోటబడి)లో 1998-99వ సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థినులు అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ ముచ్చటించుకున్నారు. తమ గురువులను సన్మానించారు. శ్వేత, సుజాత, శ్రీరజ, డాక్టర్ సంధ్య, స్రవంతి, హైమావతి, ఎడ్ల స్వప్న, అనూష, డీస్వప్న, బాంధవి పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 27 : కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ప్రొఫెసర్ జేఏసీ నేతలు శ్రీధర్ కుమార్‌లోధ్, సాదు రాజేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వివిధ యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 1,200కు పైగా కుటుంబాలు ఆవేదనతో సమ్మెలోకి వచ్చాయని, ఆయా యూనివర్సిటీల్లో వీసీలు బాధ్యత తీసుకొని ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సతీశ్, సత్య, సూర్యనారాయణ, చంద్రశేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, సునీత, భాగ్య, సుకన్య, ఉషా కిరణ్, శ్రీలత, సత్యనారాయణ, విద్యాసాగర్, బ్రహ్మం, రంజిత, మధుకర్‌రావు, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.